

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తిరుపతి

## మానవ హక్కుల ఉల్లంఘన నేరం

**అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి**

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 9: భ్రూణ హత్యలు, మానవ అక్రమ రవాణాతో హక్కుల ఉల్లంఘనకు పాల్పడడం నేరమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి అన్నారు. శనివారం మండలంలోని ఈదులపూసపల్లి గ్రామంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. ఐక్య సమితి ప్రవేశపెట్టిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం యావత్ మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం ప్రజలకు నిత్య జీవితంలో ఉపయోగపడే అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు, అడ్వకేట్లు తాటిపాముల సునీత, మోహన్, వార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నీ బ్యాగుల కొటేషన్స్‌కు ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 9: జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డులో ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో స్క్రాప్, గన్నీ బ్యాగుల కోసం కొనుగోలుదారుల నుంచి కొటేషన్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి 16 వరకు స్వయంగా పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## బీబీనాయక్ తండాలో కంటి వైద్య శిబిరం

కురవి, డిసెంబర్ 9: మండలంలోని బీబీనాయక్ తండాలో సూర్యచంద్ర కంటి ఆస్పత్రి డాక్టర్ సృజనకుమార్ ఆధ్వర్యంలో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆపరేషన్ కోసం మహబూబాబాద్ సూర్య దవాఖానకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడ శ్రీను, డాక్టర్ మాధవరావు, భూక్యా రవి, బోడ రవీందర్, వీరన్న, ప్రశాంత్, బోడ సాగర్ పాల్గొన్నారు.



గార్ల: ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గార్ల, డిసెంబర్ 9: మండలంలోని కస్నాతండాకు చెందిన భూక్యా కిషన్ ఇటీవల మృతి చెందగా, శనివారం దశదిన కర్మ నిర్వహించారు. సీతంపేట కాంగ్రెస్ నాయకులు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను సర్పంచ్ బానోత్ లావణ్యా శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం రూ.10వేలు, గట్టు సాయన్న రూ.వెయ్యి, కాంగ్రెస్ నాయకులు భూక్యా సర్వేశ్, మాలోత్ భాస్కర్, చిన్న, అరుణ్, శివ ఆర్థిక సాయం చేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, చిన్న, వీర్యా పాల్గొన్నారు.

**స్నేహితుడి కుటుంబానికి..**

కేసముద్రం, డిసెంబర్ 9: మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన సంతోష్‌కు అతడి స్నేహితులు రూ.21వేల ఆర్థిక సాయం అందించారు. సంతోష్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన చిన్ననాటి స్నేహితులు 2005-06 పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మధుకర్, భాషా, శ్రీకాంత్, సురేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

**తొర్రూరు మున్సిపల్ కమిషనర్ సరస్వతి**

తొర్రూరు, డిసెంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షనీయమని మున్సిపల్ కమిషనర్ సరస్వతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డీఎం పరిమళతో కలిసి ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణించి ఉచిత టికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం మహిళాలోకానికి గొప్ప వరంలాంటిదన్నారు. బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు వయసుతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలో ఎక్కడికైనా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. దీంతో మహిళలకు ప్రయాణ ఖర్చులు తగ్గించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్, ఎస్‌టీఐ రజిత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



తొర్రూరు: మహిళలకు ఉచిత బస్సును ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సరస్వతి, నాయకులు

**'మహాలక్ష్మి' అమలుపై సంబురాలు**

డోర్నకల్, డిసెంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం శనివారం మహాలక్ష్మి పథకం ప్రారంభించిన సందర్భంగా మున్సిపాలిటీ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరిపారు. గార్ల-ఇల్లెందు బస్సును అలంకరించి, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్, హరికృష్ణ, వాసు పాల్గొన్నారు.

**సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం**

పెద్దవంగర: రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం(మహాలక్ష్మి) పథకం అమలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగు మురళీగౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవేంద్ర, సీతారాంనాయక్, కర్ణాకర్‌రెడ్డి, సతీశ్‌చారి పాల్గొన్నారు.

**కేసముద్రంలో..**

కేసముద్రం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించిందని మాజీ జడ్పీటీసీ బండారు పద్మ, మాజీ సర్పంచ్ అల్లం రమ అన్నారు. శనివారం వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. కేసముద్రంలో సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బట్టు శ్రీనివాస్, నాయకులు గుగులోత్ దస్రూనాయక్, అల్లం నాగేశ్వరరావు, బీ వెంకన్న, ఏ మహేందర్‌రెడ్డి, టీ వెంకన్న, వసంతరావు, పీ వెంకట్‌రెడ్డి, టీ వీరేశ్, సాయిప్రసన్న తదితరులు ఉన్నారు.



పెద్దవంగర: సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేసముద్రంలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## లంబాడాలకు సముచిత స్థానం కల్పించాలి

- మంత్రివర్గంలో చోటు కల్పించి న్యాయం చేయాలి
- సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 9: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడాలకు సముచిత స్థానం కల్పించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న అన్నారు. శనివారం పట్టణంలోని మార్వాడీ సత్రంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో పదవీ ప్రమాణ స్వీకారం చేసిన ఐదుగురు లంబాడా ఎమ్మెల్యేలు ఉన్నారని, వారిలో ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 36 లక్షల మంది గిరిజనులుంటే అందులో 30 లక్షల మంది లంబాడాలు ఉన్నారని, నూతన ప్రభుత్వం ఏర్పాటులో వారు ఎంతో కృషి చేశారన్నారు. వారికి మంత్రి పదవి కల్పించి లంబాడా జాతికి తగిన న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యులు మోతీలాల్ నాయక్, బానోత్ వినోద్, సురేశ్ నాయక్, బాలునాయక్, పద్మబాయి, భిక్షం, రాంబాబు, లింగన్న, నరేందర్ పాల్గొన్నారు.

**ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వాలి**

నర్సింహులపేట, డిసెంబర్ 9: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు లావుడ్యా ఉదయ్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల ముందు గిరిజనుల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**

నర్సింహులపేట, డిసెంబర్ 9: మండలంలోని రామన్నగూడెం గ్రామ శివారులో ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లును శనివారం పట్టుకున్నట్లు ఎస్సై జీ సతీశ్ తెలిపారు. శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'ఆకేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా' శీర్షికన కథనం ప్రచురితమవడంతో పోలీసులు స్పందించారు. దాడులు చేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని తహశీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఘనంగా జైన తీర్థంకరుల ఊరేగింపు మహోత్సవం

డోర్నకల్, డిసెంబర్ 9: డోర్నకల్ దిగంబర్ జైన్ సమాజం ఆధ్వర్యంలో పాల రాతితో నిర్మించబడిన నూతన జైన దేవాలయ ప్రారంభోత్సవం కోసం ప్రాణ ప్రతిష్ఠ పొందిన 12 జైన తీర్థంకరుల ఊరేగింపు మహోత్సవం శనివారం నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమంలో జైన్ మతస్తులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 9: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాబన్న అన్నారు. శనివారం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను అర్థం చేసుకొని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగయ్య, బాలు, పుల్లయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

**తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి**

నెల్లికుదురు: వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని టీఆర్‌ఎస్‌వీ మండల నాయకుడు తూళ్ల వివేక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట వర్షానికి తడిసిపోయిందని, సంబంధిత ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులు యాసంగి పంట సాగుకు సిద్ధమవుతున్నారని, ఎకరానికి ఇచ్చే రూ.15 వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసి వారి ఆర్థిక ఇబ్బందులు తీర్చాలని కోరారు.